ఎందుకీ మౌనం?

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు చిల్లిగవ్వ ఇవ్వకపోయినా పెదవి విప్పని కాంగ్రెస్ సర్కారు

- కేంద్రం వైఖరిపై కర్ణాటక సీఎం ఢిల్లీలో నిరసన
- అదే స్థాయిలో తమిళ నాడు సర్కార్ ఆగ్రహం
- అయినా ఉలుకు-పలుకు లేని రేవంత్ ప్రభుత్వం
- బీజేపీ-కాంగ్రెస్ మిలాఖత్‌పై విమర్శలు

ఢిల్లీలో ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం, ఎమ్మెల్యేలు

హైదరాబాద్, ఫిబ్రవరి 7 (నమస్తే తెలంగాణ): బీజేపీయేతర రాష్ట్రాల పట్ల కేంద్రం అనుసరిస్తున్న వివక్షకు వ్యతిరేకంగా కర్ణాటకలోని అధికార కాంగ్రెస్ ప్రభుత్వం ఢిల్లీలో బుధవారం నిరసనకు దిగింది. కేంద్ర బడ్జెట్‌లో తమ రాష్ట్రానికి పన్నుల కేటాయింపులు, గ్రాంట్ ఇన్-ఎయిడ్ విడుదలలో అన్యాయం జరిగిందని కర్ణాటక సీఎం సిద్ధరామయ్య 135 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎంపీలతో కలిసి ధర్నాకు దిగారు. విపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాల పట్ల కేంద్రంలోని బీజేపీ సర్కార్ అవలంబిస్తున్న వివక్షను నిరసిస్తూ తమిళనాడులో డీఎంకే ప్రభుత్వం కూడా నిరసన గళమెత్తింది. కానీ, కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి తెలంగాణ సర్కార్ కనీసం సంఘీభావం కూడా ప్రకటించలేదు. కర్ణాటక, తమిళనాడుకు మాదిరిగానే కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు కూడా ఎలాంటి కేటాయింపులు లేకపోయినా ఇక్కడి కాంగ్రెస్ సర్కార్ మౌనంగా ఉండటంలో మతలబు ఏమిటన్నది ఇప్పుడు జాతీయ స్థాయిలో చర్చకు దారితీసింది.

మోదీని కలిశాక సీఎం రేవంత్‌రెడ్డి మౌనం?

తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ప్రధాని మోదీని కలిశాక కేంద్రంపై నోరు మెదకపోవడంలో ఆంతర్యం ఏమిటి? తెలంగాణలోని కాంగ్రెస్ సర్కార్‌కు, కేంద్రంలోని బీజేపీ సర్కార్‌కు మధ్య ఏదైనా లోపాయికారి ఒప్పందం కుదిరిందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తెలంగాణలో కాంగ్రెస్ అధికారం చేపట్టేందుకు కర్ణాటకలోని కాంగ్రెస్ సాయం చేసిందనేది బహిరంగ రహస్యమే. కానీ, విపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాల పట్ల కేంద్రం అనుసరిస్తున్న వివక్ష, సహాయ నిరాకరణపై కర్ణాటక ఢిల్లీ వీధుల్లో కేంద్రం చర్యను ఎండగట్టినా తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించకపోవడం, కనీసం సంఘీభావం ప్రకటించకపోవడంలో మతలబు ఏమిటి? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

సోషల్ మీడియాలో విసుర్లు

బీజేపీయేతర రాష్ట్రాల పట్ల కేంద్రం వివక్షపై కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలు స్పందించినప్పటికీ, తెలంగాణ ప్రభుత్వంలో ఉలుకూ పలుకూ లేకపోవడం విమర్శలకు దారితీస్తున్నది. తెలంగాణ సర్కార్ మౌనంపై సోషల్‌మీడియాలో నెటిజన్లు విరుచుకుపడుతున్నారు. సీఎం రేవంత్‌రెడ్డిపై ఓటుకు నోటు కేసు ఉండటమే.. ఈ మౌనానికి కారణమా? అని నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. తెలంగాణలో కాంగ్రెస్-బీజేపీ మిలాఖత్ అయిందని బీఆర్‌ఎస్ చేస్తున్న ఆరోపణలకు తాజాగా ఈ ఉదంతం మరింత ఊతమిస్తున్నది.

అది ఏఐసీసీ పిలుపు కాదని తప్పించుకునే ప్రయత్నం

విపక్ష పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల పట్ల కేంద్రం వివక్ష, కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు గ్రాంట్ ఇన్ ఎయిడ్ కింద చిల్లిగవ్వ కేటాయించకపోయినా స్పందించకపోవడానికి కారణం ఏమిటి? కర్ణాటక సర్కార్‌తో కలిసి గళం విప్పకపోవడానికి కారణం ఏమిటి? అని ఒక కాంగ్రెస్ సీనియర్ నేతను ప్రశ్నించగా, 'అది ఏఐసీసీ ఇచ్చిన పిలుపు కాదు. జంతర్ మంతర్ వద్ద నిరసన చేపట్టాలన్నది కర్ణాటక ప్రభుత్వ నిర్ణయం. మేము కర్ణాటకను అనుసరించాల్సిన అవసరం లేదు' అని చెప్పారు. అయితే, కేంద్రంలోని బీజేపీ సర్కార్ పట్ల తెలంగాణ ప్రభుత్వం మెతక వైఖరి అవలంబిస్తుందన్న భావనకు ఈ చర్య మరింత ఊతం ఇచ్చేలా ఉన్నదని ఆయన అభిప్రాయపడ్డారు.

రాష్ట్ర ప్రయోజనాలు పట్టవా?: కేటీఆర్ ఆగ్రహం

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు నిధులు కేటాయించకపోవడాన్ని నిరసిస్తూ హైదరాబాద్‌లో బీఆర్‌ఎస్ కార్యకర్తలు పోస్టర్లు వేశారు. కేంద్రప్రభుత్వ వివక్షపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడంపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా స్పందించారు. 'తెలంగాణ సీఎం నుంచి బీజేపీకి వ్యతిరేకంగా ఒక్కమాట కూడా రాలేదు.. ఎందుకీ నిశ్శబ్దం? మీరు (రేవంత్‌రెడ్డి) ఎందుకు భయపడుతున్నారు? రాష్ట్ర ప్రయోజనాల పట్ల ఈ దారుణమైన లొంగుబాటు ఎందుకు? కృష్ణానదిపై ఉన్న ప్రాజెక్టులు కేఆర్‌ఎంబీకి అప్పగించడం మొదలుకొని రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై మౌనంగా ఉండటం వరకు మీ వైఖరి నిజంగా భయంకరంగా ఉన్నది' అని పేర్కొన్నారు.

మత్స్య సంపదకు 'సోలార్' ముప్పు!

- జలాశయాల్లో ఫ్లోటింగ్ సోలార్ కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వం యోచన
- అదే జరిగితే చేపల వేటపై నిషేధం
- ఆందోళనలో మత్స్యకారులు
- జలచరాల మనుగడపైనా ప్రమాదం

హైదరాబాద్, ఫిబ్రవరి 7 (నమస్తే తెలంగాణ): జలాశయాల్లో ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టులు చేపట్టాలన్న కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయం రాష్ట్ర మత్స్యరంగానికి అశనిపాతంగా మారనుంది. సర్కారు నిర్ణయం కార్యరూపం దాల్చితే మత్స్యరంగంపై అది పెను ప్రభావాన్ని చూపిస్తుంది. ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టు ఏర్పాటు చేసే జలాశయాల్లో చేపల పెంపకాన్ని నిషేధిస్తే ఉపాధి కరువై మత్స్యకారుల జీవితాలు దుర్భరంగా మారే ప్రమాదం ఉంది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఇటీవల రాష్ట్ర పునరుత్పాదక ఇంధన సంస్థ (రెడ్కో) ఆధ్వర్యంలో అమలవుతున్న విద్యుత్తు తయారీపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని జలాశయాల్లో ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టుల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు.

రెండున్నర లక్షలమందిపై ప్రభావం

రాష్ట్రంలో సుమారు 130 వరకు రిజర్వాయర్లు ఉన్నాయి. వీటిలో చేపల పెంపకం ద్వారా సుమారు రెండున్నర లక్షలమంది మత్స్యకారులు జీవిస్తున్నారు. ఈ రిజర్వాయర్లపై ప్రభుత్వం కనుక ఫ్లోటింగ్ సోలార్ కేంద్రాలు ఏర్పాటు చేస్తే వాటిలో చేపల పెంపకాన్ని నిషేధిస్తారు. ఒకవేళ అందులో చేపలు పెరిగినా వేటను మాత్రం నిషేధిస్తారు. ఫలితంగా మత్స్యకారులు జీవనోపాధిని కోల్పోవాల్సి వస్తుంది. ఎన్టీపీసీ రిజర్వాయర్‌లో 100 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ కేంద్రాన్ని ఏర్పాటు చేసిన తర్వాత అందులో చేపల వేటను నిషేధించారు. ఇప్పుడు రాష్ట్రంలోని అన్ని జలాశయాల్లోనూ సోలార్ కేంద్రాలు ఏర్పాటు చేస్తే పూర్తిగా ఉపాధికి దూరం కావాల్సి వస్తుందని మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జలరాశుల మనుగడ ప్రశ్నార్థకం

ఫ్లోటింగ్ సోలార్ కేంద్రాల ఏర్పాటు వల్ల మత్స్య సంపదతోపాటు ఇతర జలరాశుల మనుగడ కూడా ప్రశ్నార్థకంగా మారుతుందని నిపుణులు చెప్తున్నారు. సోలార్ ఫలకలు అడ్డుకోవడంతో సూర్యకిరణాల నీటిలోకి చొచ్చుకొనిపోవు. ఫలితంగా చేపల ఎదుగుదల నిలిచిపోతుంది. అంతేకాదు, ఆక్సిజన్ ఉత్పత్తి కూడా నిలిచిపోయి జలచరాల మనుగడకు ముప్పువాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మంచం పట్టిన సాంబయ్యపల్లి

- జ్వరాలు, కీళ్ల నొప్పలతో బాధపడుతున్న ఊరి జనం
- రూ.వేలల్లో ఖర్చు.. భరించలేని స్థితిలో పేదలు
- 45 రోజులుగా అవస్థలు.. పట్టించుకోని అధికారులు

గూడూరు, ఫిబ్రవరి 7 : జ్వరాలు, కీళ్లనొప్పులు, ప్లేట్‌లేట్స్ తగ్గడం వంటి సమస్యలతో ఆ ఊరంతా మంచం పట్టింది. నెలన్నర రోజులుగా గ్రామస్థులంతా దవాఖానల చుట్టూ తిరుగుతూ వేలల్లో ఖర్చుపెట్టుకుంటున్నా మాయదారి రోగం తగ్గట్లేదు. చిన్నపిల్లల నుంచి పెద్దల వరకు అంతా అవస్థ పడుతున్నారు. పరిస్థితి ఇంత దారుణంగా ఉన్నా ఇప్పటివరకు ఏ ఒక్క వైద్యుడు, అధికారి, నాయకుడు ఇటువైపు తొంగిచూడలేదని స్థానికులు వాపోతున్నారు. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలోని రాములుతండా గ్రామ పంచాయతీ పరిధిలోని సాంబయ్యపల్లి గ్రామంలో చోటుచేసుకుంటున్న ఈ వ్యాధులు ఎవరికీ అంతుబట్టకుండా ఉన్నాయి. గ్రామంలో దాదాపు 40 కుటుంబాలు ఉన్నాయి. వీరు 45 రోజులుగా జ్వరాలు, కాళ్లవాపులు, మోకాళ్లనొప్పులు, నడుం నొప్పి, రక్తకణాలు తగ్గిపోవడం వంటి సమస్యలతో బాధపడుతున్నారు. ప్రతి ఇంటిలో మంచంపట్టిన వారే ఉన్నారని గ్రామస్థులు చెబుతున్నారు. ఇంట్లో ఒకరికి జ్వరం వస్తే చాలు.. వారం, పది రోజుల్లోపే మరొకరు అనారోగ్యంతో మంచం పడుతున్నారు. ఈ వ్యాధులతోపాటు ఎవరికైనా పాత రుగ్మతలు, నొప్పులు ఉంటే వారి పరిస్థితి మరీ దారుణంగా ఉన్నది. గ్రామాన్ని పట్టించుకునే వారే లేక కొంత మంది ప్రైవేట్ దవాఖానలను ఆశ్రయిస్తుండగా, దాదాపు రూ.40 వేల నుంచి రూ.60 వేల వరకు డబ్బులు ఖర్చు అవుతున్నట్టు బాధితులు తెలిపారు. ఎవరైనా గ్రామానికి చుట్టపు చూపుగా వచ్చినా వారికి కూడా జ్వరాలు అంటుకుంటున్నాయంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉన్నదో అర్థం చేసుకోవచ్చు. సముద్రాల సమ్మక్క డెంగీ లక్షణాలతో ఈనెల 2న మరణించగా ఇటీవల గుగులోతు స్వామి అనే వ్యక్తి మరణించాడు.

20 వేలు ఖర్చయినయ్

పదిహేను రోజుల నుంచి జ్వరం వస్తున్నది. ప్రైవేట్ దవాఖానకు వెళ్లిన. నా ఒక్కదానికే ఇప్పటివరకు రూ.20 వేల వరకు ఖర్చయినయ్. ఇంట్లో ఒకరి తర్వాత ఒకరికి జ్వరాలు వచ్చి కీళ్ల నొప్పులు, కాళ్లనొప్పులు వస్తున్నాయి. ఇప్పటివరకు మా ఇంటికి ఎవరూ వచ్చింది లేదు.. చూసిందీ లేదు. పూర్తిగా చేతకాకుండా ఉన్నది. నొప్పులతో లేచి నిలబడలేకపోతున్నా.

– ఆకారపు రమ, సాంబయ్యపల్లి

పిల్లలకు, నాకూ జ్వరం వచ్చింది

ఇలాంటి జ్వరాలను ఇప్పటి దాక ఎన్నడూ చూడలేదు. నా మనుమడి దగ్గరి నుంచి నా వరకు ఇంట్లో అందరికీ జ్వరాలు వచ్చాయి. అస్సలు చాతనైతలేదు. పని చేసుకోలేకపోతున్నం. పనిచేసుకుంటేనే బతుకుతం. ఏం చేయాలో అర్థం కావడం లేదు. డాక్టర్లు వచ్చి మందులిస్తే బాగుండు. ఇప్పటికే వేల రూపాయలు ఖర్చు చేసినం.

– గుగులోత్ ఈర్య

నేటి నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు

- రేపు ఉభయ సభల భేటీలో గవర్నర్ ప్రసంగం
- 10న బడ్జెట్ ప్రవేశపెట్టనున్న ప్రభుత్వం

హైదరాబాద్, ఫిబ్రవరి 7 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం 11.30 గంటలకు ఉభయ సభల సంయుక్త సమావేశంలో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ప్రసంగిస్తారు. 9వ తేదీన గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై ఉభయ సభలు చర్చించి ఆమోదించనున్నారు. 10వ తేదీ శనివారం రాష్ట్ర వార్షిక బడ్జెట్ ప్రవేశపెడుతారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలిసారి బడ్జెట్ సమావేశాలు జరుగుతున్నాయి. ప్రభుత్వం ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టడానికే మొగ్గు చూపుతున్నట్టు సమాచారం.

ఏర్పాట్లపై స్పీకర్, చైర్మన్ సమీక్ష

శాసన సభ, శాసన మండలి సమావేశాలు సజావుగా సాగేందుకు ముందస్తుగా అధికారులు, పోలీస్ ఉన్నతాధికారులతో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు బుధవారం సమీక్షించారు. అసెంబ్లీ కమిటీ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ సభల్లో సభ్యులు అడిగే ప్రశ్నలకు సకాలంలో సమాధానాలు ఇవ్వాలని, ప్రత్యేక నోడల్ అధికారిని నియమించి సమావేశాలు సజావుగా నడిచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అధికారులు తప్పకుండా ఆఫీసర్ బాక్స్‌లో ఉండేలా చూడాలని కోరారు. సీఎం సూచన మేరకు పాత అసెంబ్లీ భవనంలోకి శాసన మండలిని మార్చాలని నిర్ణయించామని చెప్పారు. సమావేశాలు జరిగే సమయంలో ధర్నాలు, ర్యాలీలు జరిగే అవకాశాలున్నందున అప్రమత్తంగా ఉండాలని పోలీసులకు సూచించారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ప్రొటోకాల్ విషయంలో ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలని అన్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ ఎలాంటి లోటుపాట్లు లేకుండా అసెంబ్లీ సమావేశాలు నిర్వహించేందుకు ఏర్పట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్ మాట్లాడుతూ సమావేశాలు జరుగుతున్న సమయంలో మంత్రులు అందుబాటులో ఉండేలా చూడాలని, అసెంబ్లీ కమిటీల ఏర్పాటును త్వరగా పూర్తి చేయాలని సూచించారు.

ప్రొటోకాల్ పాటించాలి: శ్రీధర్‌బాబు

శాసనసభ సమావేశాల సమయంలో అన్ని విభాగాలను సమన్వయం చేసేందుకు, త్వరితగతిన సమాధానాలిచ్చేందుకు ఒక సీనియర్ ఐఏఎస్ అధికారిని ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు సూచించారు. ఈ సమావేశాల్లో మంత్రులకు సబ్జెక్టులవారీగా బాధ్యతలు ఇస్తున్నామని, సభ్యుల ప్రశ్నలకు వీలైనంత త్వరగా సమాధానాలు అందేలా చర్యలు తీసుకోవాలని సీఎస్‌ను కోరారు. ప్రొటోకాల్ విషయంలో తప్పిదాలు జరగవద్దని స్పష్టంచేశారు. కొత్త సభ్యుల కోసం సమావేశాల తర్వాత రెండు రోజులు ఓరియంటేషన్ కార్యక్రమం ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విప్‌లు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, బీర్ల ఐలయ్య, లెజిస్లేచర్ అడ్వైజరీ ప్రసన్నకుమార్, డీజీపీ రవిగుప్తా, శాసనసభ కార్యదర్శి నరసింహాచార్యులు, హైదరాబాద్ సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

లండన్‌లో లగ్జరీ వాచీల చోరీ..

- ఇండియన్ సీఈవోల ఆందోళన

న్యూఢిల్లీ: లండన్ నడిబొడ్డుపై దోపిడీలు, దొంగతనాలు జరుగుతుండటంపై భారతీయ వ్యాపారవేత్తలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. న్యూఢిల్లీకి వచ్చిన బ్రిటిష్ షాడో ఫారిన్ సెక్రటరీ డేవిడ్ లామీ దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లారు. లగ్జరీ వాచ్‌ల దొంగతనం గురించి ఫిర్యాదు చేశారు. ఢిల్లీకి చెందిన ఓ సంస్థ సీఈవో మాట్లాడుతూ, ఇటీవల లండన్‌లో పర్యటించిన భారత సీఈవోలు చాలా మంది దోపిడీకి గురయ్యారని చెప్పారు. వారి వద్ద ఉంటే లగ్జరీ వాచ్‌లు, హ్యాండ్‌బ్యాగులు, మొబైల్ ఫోన్లు చోరీ అయ్యాయని, దీనిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరారు.

తుపాకులు ఎలా ఉపయోగించాలి?

రష్యా పాఠశాలల్లో ప్రత్యేక పాఠం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 07: ఉక్రెయిన్‌తో సుదీర్ఘంగా కొనసాగుతున్న యుద్ధం నేపథ్యంలో రష్యా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అణుదాడుల నుంచి తమను తాము రక్షించుకోవడం, కలష్నికోవ్ తుపాకులను ఉపయోగించడం ఎలానో విద్యార్థులకు బోధించనున్నారు. ఇందుకు సంబంధించి ప్రత్యేక పాఠ్యాంశాలను ప్రవేశపెట్టబోతున్నారు. ఇందులో భాగంగా 'మాతృభూమి భద్రత, రక్షణ ప్రాథమికాంశాలు' పేరుతో ప్రత్యేక సిలబస్ తీసుకొస్తున్నది. ఈ ఏడాది సెప్టెంబర్ నుంచి దేశవ్యాప్తంగా అన్ని స్కూళ్లలోనూ దీనిని ప్రవేశపెట్టనున్నట్టు విద్యాశాఖను ఉటంకిస్తూ వార్తలు వెలువడ్డాయి. ఉక్రెయిన్‌తో యుద్ధం నేపథ్యంలో అణుదాడులు జరిగితే తమను తాము ఎలా రక్షించుకోవాలి? సామూహిక విధ్వంసం, పోరాట లక్షణాలు, హానికారక ప్రభావాలు, వాటి నుంచి రక్షణ పద్ధతులను బోధిస్తారు. సహజ, మానవ నిర్మిత, జీవ సామాజిక ప్రకృతి వైపరీత్యాలతోపాటు మిలటరీ ముప్పు సంభవించినప్పుడు తమను తాము ఎలా రక్షించుకోవాలో బోధిస్తారు.

బాలుడి కిడ్నాప్ కలకలం

అచ్చంపేట, ఫిబ్రవరి 7: నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలంలోని లక్ష్మాపూర్‌లో బాలుడి కిడ్నాప్ కలకలం రేపింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ శ్రీశైలం మూడేండ్ల కుమారుడు సత్యం బుధవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో ట్యూషన్‌కు వెళ్లి ఇంటికి వస్తుండగా.. గుర్తుతెలియని వ్యక్తి బైక్‌పై వచ్చి బాలుడిని కిడ్నాప్ చేశారు. బాలుడిని బైక్‌పై తీసుకెళ్తుండగా.. గ్రామస్థులు వెంబడించారు. ఆగంతకుడు బాలుడిని తీసుకొని పారిపోవడంతో తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలుడి ఆచూకీ కోసం పోలీసులు, కుటుంబ సభ్యులు గాలిస్తున్నారు.

ఉత్పత్తి దశలోకి బీ థర్మల్ విద్యుత్తు కేంద్రం

జ్యోతినగర్(రామగుండం), ఫిబ్రవరి 7: పెద్దపల్లి జిల్లాలోని రామగుండం బీ థర్మల్ విద్యుత్తు కేంద్రం బుధవారం ఉత్పత్తి దశలోకి వచ్చింది. 62.5 మెగావాట్ల సామర్థ్యం కలిగిన ప్లాంట్‌లో సోమవారం ట్యూబ్ లీకేజీతో ఉత్పత్తిని నిలిపివేశారు. వెంటనే మరమ్మతు పనులు చేపట్టి యూనిట్‌ను పునరుద్ధరించారు. కాగా, 50 ఏండ్ల జీవితకాలంతో నిర్మించిన ప్లాంటులో తరుచూ సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి.

ఈసారి వేసవిలో భగభగలే!

- తీవ్రమైన ఎండలు, వడగాడ్పులు తథ్యం
- ఏప్రిల్ తర్వాత ఎల్‌నినో బలహీనం
- సెప్టెంబర్ నుంచి లానినా పరిస్థితులు
- వాతావరణ నిపుణుల అంచనా

బుధవారం రాష్ట్రంలో నమోదైన గరిష్ఠ ఉష్ణోగ్రతలు	
ఆదిలాబాద్	35.8 డిగ్రీలు
భద్రాచలం	34.5
హనుమకొండ	35.5
హైదరాబాద్	36.2
ఖమ్మం	36.2
మహబూబ్‌నగర్	37
మెదక్	35.2
నల్లగొండ	35.2
నిజామాబాద్	35.6
రామగుండం	35

హైదరాబాద్, ఫిబ్రవరి 7 (నమస్తే తెలంగాణ): ఈ ఏడాది వేసవిలో ఎండలు, వడగాడ్పుల తీవ్రత అధికంగా ఉంటుందని, నిరుటి కంటే మరింత తీవ్రమైన వేసవిని చూడక తప్పదని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం పసిఫిక్ మహాసముద్రంలో ఎల్‌నినో తీవ్రంగా ఉన్నందున దాని ప్రభావంతో వేసవి తీవ్రత అధికంగా ఉంటుందని చెప్తున్నారు. ఏప్రిల్ తర్వాత ఎల్‌నినో బలహీనపడి తటస్థ పరిస్థితులు ఏర్పడతాయని, ఆ క్రమంలో వాతావరణ పరిస్థితులు వేగంగా మారి సెప్టెంబర్ నుంచి పసిఫిక్ మహాసముద్రంలో లానినా ఏర్పడుతుందని అంచనా వేస్తున్నారు. దీని వల్ల నైరుతి రుతుపవన వర్షాలు విస్తారంగా కురుస్తాయని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) చెప్తున్నది. అక్టోబర్ చివరినాటికి 60% శాతం లానినా పరిస్థితులు ఏర్పడతాయని, శీతాకాలంలో తీవ్రమైన చలి ఉంటుందని అమెరికాకు చెందిన నేషనల్ ఓషియానిక్ అండ్ అట్మాస్పియరిక్ అడ్మినిస్ట్రేషన్ (నోవా) అంచనా వేసింది.

పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

ప్రస్తుతం రాష్ట్రంలో పగటి ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. బుధవారం రాష్ట్రవ్యాప్తంగా దాదాపు అన్ని జిల్లాల్లో పగటి ఉష్ణోగ్రతలు 35 సెల్సియస్ డిగ్రీలకుపైగా నమోదయ్యాయి. అత్యధికంగా మహబూబ్‌నగర్ జిల్లాలో 37 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్టు వాతావరణ శాఖ వెల్లడించింది. రానున్న 5 రోజుల్లో పగటి ఉష్ణోగ్రతలు మరింత పెరుగవచ్చని ఐఎండీ శాస్త్రవేత్త డాక్టర్ ఏ శ్రావణి తెలిపారు.

నేడు రాజ్యసభ ఎన్నికల నోటిఫికేషన్

- 15 వరకు నామినేషన్ల స్వీకరణ.. 27న పోలింగ్

హైదరాబాద్, ఫిబ్రవరి 7 (నమస్తే తెలంగాణ): రాజ్యసభ ఎన్నికలకు గురువారం నోటిఫికేషన్ విడుదల కానున్నది. అసెంబ్లీలో ఈ నెల 15 వరకు అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించనున్నారు. 16న పరిశీలన, 20న నామినేషన్ల ఉపసంహరణ ఉంటుంది. అనంతరం అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికైతే ధ్రువపత్రాలను అందిస్తారు. లేకుంటే ఈ నెల 27న ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారు. బీఆర్‌ఎస్ రాజ్యసభ ఎంపీలు బడుగుల లింగయ్యయాదవ్, సంతోష్‌కుమార్, వద్దిరాజు రవిచంద్ర పదవీకాలం ఏప్రిల్ 2తో ముగియనున్నది. ఈ 3 స్థానాల్లో కాంగ్రెస్‌కు రెండు స్థానాలు, బీఆర్‌ఎస్ ఒక స్థానం దక్కే అవకాశాలున్నాయి.

మద్యం మత్తులో తల్లిని చంపిన కొడుకు

అనంతగిరి, ఫిబ్రవరి 7: మద్యం మత్తులో ఓ కొడుకు తల్లిని హతమార్చాడు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలంలోని తమ్మరబండపాలెం గ్రామంలో మంగళవారం రాత్రి చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గరిడేపల్లి మండలం సర్వారం గ్రామానికి చెందిన పుట్టబంతి రాములమ్మ (70) రెండేండ్ల క్రితం తన కుమారుడు వీరేశం(35)తో కలిసి తమ్మరబండపాలెం సుందరయ్యనగర్‌కు వలస వచ్చి జీవనం కొనసాగిస్తున్నది. వీరేశం సుతారి పని చేస్తున్నాడు. మద్యానికి బానిసైన వీరేశం తరుచూ తల్లిని కొట్టేవాడు. మంగళవారం తాగి వచ్చిన వీరేశాన్ని మద్యం తాగొద్దని వారించింది. ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకోవడంతో ఆవేశానికి గురైన వీరేశం తల్లి గొంతు నులిమి చంపాడు. సమాచారం అందుకున్న అనంతగిరి ఎస్సై అనిల్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రిజిస్ట్రేషన్ల చట్టంలో మార్పులు చేశారా?

- ధరణి పునర్నిర్మాణ కమిటీ ఆరా.. అధికారులతో సమావేశం

హైదరాబాద్, ఫిబ్రవరి 7 (నమస్తే తెలంగాణ): ధరణి పోర్టల్‌ను ప్రవేశపెట్టే క్రమంలో తాసిల్దార్లకు రిజిస్ట్రేషన్ అధికారాలు కట్టబెట్టేందుకు స్టాంపులు, రిజిస్ట్రేషన్ల చట్టంలో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏం మార్పులు చేసిందన్న అంశంపై ధరణి పునర్నిర్మాణ కమిటీ ఆరా తీసింది. బుధవారం ఈ కమిటీ సచివాలయంలో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ, టీఎస్ఐఐసీ అధికారులతో భేటీ అయ్యింది. ధరణి పోర్టల్‌లో జరుగుతున్న రిజిస్ట్రేషన్లు, రిజిస్ట్రేషన్ల శాఖ ద్వారా జరుగుతున్న రిజిస్ట్రేషన్లతోపాటు వాటి మధ్య ఉన్న వ్యత్యాసం గురించి కమిటీ సభ్యులు అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయేతర భూముల తరహాలో ఇండ్ల వద్దకు వెళ్లి వ్యవసాయ భూములు రిజిస్ట్రేషన్ చేసేలా చట్టంలో వెసులుబాటు ఉన్నదా? అని ఆరా తీశారు. ఈ సందర్భంగా టీఎస్ఐఐసీ అధికారులు మాట్లాడుతూ.. ల్యాండ్ బ్యాంక్‌లో తమకు 60 వేల ఎకరాల భూములు ఉండగా ధరణి పోర్టల్‌లో 25 వేల ఎకరాలు మాత్రమే నమోదైనట్టు చెప్పారు. దీంతో మిగతా 35 వేల ఎకరాలు ఎందుకు నమోదు కాలేదని కమిటీ ప్రశ్నించింది. సమావేశంలో కమిటీ సభ్యులు కోదండరెడ్డి, మధుసూదన్, సీఎమ్మార్వో ప్రాజెక్టు డైరెక్టర్ లచ్చిరెడ్డి, రిజిస్ట్రేషన్ల శాఖ అదనపు ఐజీ సుభాషిణి, డీఐజీ రవీందర్‌రావు, రిజిస్ట్రార్ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు. ధరణి పునర్నిర్మాణ కమిటీలో మరో సభ్యునిగా ఉన్న సునీల్ కుమార్ తండ్రి సంజీవరెడ్డి ఇటీవల తుదిశ్వాస విడిచారు. ఈ నేపథ్యంలో సునీల్ కమిటీ సమావేశానికి హాజరు కాలేదు. బుధవారంతో తమ సమావేశాలు తాత్కాలికంగా ముగిసినట్టు ధరణి కమిటీ సభ్యులు తెలిపారు. ఇప్పటివరకు సేకరించిన అంశాలతో త్వరలో ప్రభుత్వానికి మధ్యంతర నివేదిక సమర్పించనున్నట్టు తెలిసింది. అనంతరం క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లాలని కమిటీ భావిస్తున్నది.